# న్యూ మూవీ



కార్తికేయ, కార్తికేయ 2 సినిమాలతో పాన్ ఇండియా హీరోగా గుర్తింపు పొందిన టాలీవుడ్ యువ నటుడు నిఖిల్ సిద్ధార్థ. 'స్వయంభు', 'ది ఇండియా హౌస్' అనే రెండు సినిమాలతో బిజీగా ఉన్న నిఖిల్ తాజాగా మరో సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. బొమ్మరిల్లు సినిమాలో హిట్ సాంగ్ 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' అనే టైటిల్‌తో రానున్న ఈ మూవీని 'స్వామిరారా' డైరెక్టర్ సుధీర్ వర్మ తెరకెక్కిస్తుండగా, ఛత్రపతి, డార్లింగ్, వంటి చిత్రాలు నిర్మించిన శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ప్రొడక్షన్ బ్యానర్ మీద బివిఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నారు. దీపావళికి రిలీజ్ కానున్న ఈ మూవీకి సంబంధించిన ఫస్ట్‌లుక్‌ను ఆదివారం మూవీ టీం రిలీజ్ చేసింది. ఫస్ట్ లుక్ చూస్తే లవ్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ మూవీ ఉండబోతోందని తెలుస్తోంది. కన్నడ బ్యూటీ రుక్మిణి వసంత్ ఈ సినిమాలో కథానాయికగా నటిస్తోంది.

# వారం రోజుల్లో.. విశ్వం రిలీజ్

టాలీవుడ్ దర్శకుడు శ్రీనువైట్ల, ప్రముఖ నటుడు గోపిచంద్ కాంబినేషన్లో వస్తున్న కొత్త చిత్రం.. విశ్వం. కావ్య థాపర్ కథానాయికగా నటించిన ఈ మూవీ దసరా కానుకగా అక్టోబర్ 11న రిలీజ్ కానుంది. విడుదల తేదీ దగ్గరపడటంతో మూవీ టీం వరుస ప్రమోషన్లు చేస్తోంది. ఇప్పటికే రిలీజ్ అయిన టీజర్ మూవీపై అంచనాలు పెంచగా, ఆదివారం మూవీ టీం ట్రైలర్‌ను రిలీజ్ చేసింది. ఈ ట్రైలర్ చూస్తుంటే.. శ్రీనువైట్ల మళ్లీ తన కామెడీతో అలరించబోతున్నట్లు తెలుస్తుంది. ఈ సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, చిత్రాలయం సంస్థలు నిర్మిస్తుండగా, కేవీ గుహన్ సినిమాటోగ్రఫీ అందించారు. ఈ మూవీకి చేతన్ భరద్వాజ్ సంగీతాన్ని సమకూర్చారు. ఆరేళ్ల గ్యాప్ తర్వాత వస్తున్న శ్రీను వైట్ల దర్శకత్వంలో వస్తున్న ఈ మూవీపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలున్నాయి.



# ఫ్యాషన్ అంటే.. అందాల ప్రదర్శనేనా?



'కళ్యాణం కమనీయం'తో తెలుగు తెరకు పరిచయమైన నటి ప్రియా భవానీ శంకర్ ప్రస్తుతం తమిళ సినిమాలతో బిజీబిజీగా ఉంది. తన నెక్ట్స్ మూవీ 'బ్లాక్' రిలీజ్ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్లామర్ రోల్స్ పోషించడంపై ఒకింత అసహనం వ్యక్తం చేశారు. ఫ్యాషన్ పేరుతో శరీరాన్ని చూపించడం తనకు ఇష్టం లేదన్నారు. ' ప్రేక్షకులను థియేటర్లకు వచ్చేలా చేసేందుకు గ్లామర్ పేరుతో ఒళ్లు చూపించటం నాకు నచ్చదు. అలాంటి ఆఫర్లకు ఓకే చెప్పలేను. కెరీర్ పరంగా ఎప్పుడైనా వెనక్కి తిరిగి చూసుకుంటే ఏ విషయంలోనూ రిగ్రెట్స్ ఉండొద్దనే అనుకుంటా. ఒక నటిగా, నెగెటివ్ రోల్స్‌కూ నేను రెడీయే. అలాగే, ఒక హీరోయిన్‌గా ఫ్యాషన్ పేరుతో కొన్నింటిని ప్రమోట్ చేయలేను' అని ఆమె చెప్పారు. కాగా, జీవా హీరోగా వస్తున్న బ్లాక్ చిత్రానికి బాలసుబ్రమణి దర్శకత్వం వహించారు. హారర్ జానర్‌లో తెరకెక్కిన ఈ మూవీ అక్టోబర్ 11న విడుదల కానుంది.

# అవార్డు ఇవ్వలేం



నృత్య దర్శకుడు షేక్ జానీ బాషా అలియాస్ జానీమాస్టర్‌కు ప్రకటించిన జాతీయ అవార్డును తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు నేషనల్ ఫిల్మ్ అవార్డు సెల్ ఒక ప్రకటనలో తెలిపింది. 2022 సంవత్సరానికి గాను జాతీయ ఉత్తమ నృత్య దర్శకుడిగా జానీ ఎంపికయ్యారు. ఈ నెల 8న దిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో పురస్కారం అందుకోవాల్సి ఉంది. అయితే తనపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడినట్లు ఓ సహాయ నృత్యదర్శకురాలు ఆయనపై ఇటీవల నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోక్సో కేసు నమోదు కావడంతో అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఈ అభియోగాల నేపథ్యంలో ఆయనకు ప్రకటించిన అవార్డును తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు, ఆహ్వానపత్రికను రద్దు చేస్తున్నట్లు సెల్ పేర్కొంది. కాగా పురస్కార కార్యక్రమానికి వెళ్లేందుకు జానీకి న్యాయస్థానం ఈ నెల 6 నుంచి 9 వరకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది.

# డెడ్ లైన్

ఐపీఎల్ మెగా ఆక్షన్ కోసం రంగం సిద్ధమవుతోంది. తమ పాత ప్లేయర్లను రిటెయిన్ చేసుకోవాలనుకునే ఫ్రాంచైజీలు నిర్ణీత గడువులోగా ప్లేయర్ల లిస్టు ప్రకటించాలని దేశంలోని బీసీసీఐ తెలిపింది. అక్టోబర్ 31, 2024లోగా పాత ప్లేయర్లను రిటెయిన్ చేసుకునే ఫ్రాంచైజీలు లిస్టు ప్రకటించాలని డెడ్ లైన్ విధించింది. నవంబర్ నెల చివర్లో ఐపీఎల్ మెగా ఆక్షన్ జరుగనుండగా 10 ఫ్రాంచైజీలు ఇది వరకే తమ జట్టులో ఆడుతున్న ప్లేయర్లలో ఆరు మంది దాకా రిటెన్షన్ పద్ధతి ద్వారా లేదా రైట్ టు మ్యాచ్ (ఆర్‌టీఎం) కార్డ్ ఆప్షన్ ద్వారా రిటెయిన్ చేసుకోవచ్చని బీసీసీఐ అనుమతులు ఇచ్చింది. అంతర్జాతీయ క్రికెట్‌లో అక్టోబర్ 31 లేదా అంతకంటే ముందే తన తొలి మ్యాచ్ ఆడబోయే ప్లేయర్‌ని కూడా ఐపీఎల్ ఆక్షన్‌లో కాప్డ్ ప్లేయర్‌గా పరిగణిస్తామని బీసీసీఐ తన ప్రకటనలో పేర్కొంది. ఏ ప్లేయర్‌ని రిటెయిన్ చేసుకోవాలో ఆ నిర్ణయాన్ని ఆర్‌టీఎం లేదా కాంబినేషన్ రిటెన్షన్ పద్ధతి ద్వారా తెలియజేయాలి. అయితే క్యాప్డ్ ప్లేయర్లు అత్యధికంగా అయిదుగురిని, అన్ క్యాప్డ్ ప్లేయర్లని ఇద్దరిని మాత్రమే రిటెయిన్ చేసుకునేందుకు అనుమతించింది. ఈసారి ఆక్షన్‌లో ప్రతి టీమ్‌కు పర్స్ లిమిట్ రూ.120 కోట్లకు పెంచింది. బీసీసీఐ సెక్రటరీ జై షా ప్రతి ప్లేయర్‌కు రూ.7.5 లక్షల మ్యాచ్ ఫీజు లభిస్తుందని ప్రకటించారు. ఒక ప్లేయర్ ఐపీఎల్ సీజన్‌లోని అన్ని మ్యాచ్‌లు ఆడితే అతనికి రూ.1.05 కోట్లు మ్యాచ్ ఫీజు ద్వారా లభిస్తుంది. ఇది కాంట్రాక్ట్ ద్వారా వచ్చే సంపాదనకు అదనం.





# తెలుగోడికి ఛాన్స్!

టీమిండియా, బంగ్లాదేశ్ మధ్య ప్రస్తుతం టెస్ట్ సిరీస్ కొనసాగుతోంది. తర్వాత టీ20 సిరీస్ ఉంటుంది. ఈ నేపథ్యంలో భారత జట్టును ఫైనల్ చేసింది భారత క్రికెట్ నియంత్రణ మండలి. సూర్య కుమార్ యాదవ్‌కు కెప్టెన్సీ అప్పగించగా, 15 మందితో కూడిన జట్టును ప్రకటించేసింది. బంగ్లాదేశ్‌తో టి20 సిరీస్‌కు తెలుగు కుర్రాడు, సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆల్ రౌండర్ నితీష్ కుమార్ రెడ్డికి కూడా చోటు దక్కింది. జులైలో జరిగిన టీ20 సిరీస్‌కు నితీష్ కుమార్ ఎంపికై గాయం కారణంగా దూరమయ్యాడు. అందుకే మరోసారి ఛాన్స్ ఇచ్చింది బీసీసీఐ. వరుసగా విఫలమవుతున్న సంజు సాంసన్‌కు మరోసారి అవకాశం ఇచ్చింది. ఇటీవల టీమిండియాలోకి రీఎంట్రీ ఇచ్చిన రిషబ్ పంత్‌కు రెస్ట్ ఇచ్చిన బీసీసీఐ. కీపర్‌గా సంజును ఎంపిక చేసింది. ఇటు గిల్, యశస్వి జైస్వాల్‌కు కూడా విశ్రాంతి ఇచ్చింది. యంగ్ క్రికెటర్స్ అభిషేక్ శర్మ, హర్షిత్ రానా అలాగే మయాంక్ యాదవ్‌కు జట్టులో అవకాశం కల్పించింది.

## టీమిండియా జట్టు ఇదే!

సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజు శాంసన్ (వికెట్ కీపర్), రింకూ సింగ్, హార్దిక్ పాండ్యా, రియాన్ పరాగ్, నితీష్ కుమార్ రెడ్డి, శివమ్ దూబే, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, వరుణ్ చక్రవర్తి, జితేష్ శర్మ (వికెట్ కీపర్), అర్ష్‌దీప్ సింగ్, రానా, మయాంక్ యాదవ్

# మూడోరోజూ అదే సీన్

క్రికెట్ అభిమానులపై వరుణుడు కరుణ చూపడం లేదు. రెండు రోజులుగా వాన కారణంగా ఇండియా, బంగ్లాదేశ్ రెండో టెస్ట్ ఆట రద్దవ్వగా, మూడోరోజు కూడా అదే సీన్ రిపీట్ అయింది. ఒక్క బంతి పడకుండానే ఆటను రద్దు చేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. ఆదివారం పెద్దగా వర్షం లేకపోయినా గ్రౌండ్ చిత్తడిగా ఉండటంతో ఆట నిర్వహణకు సాధ్యపడలేదు. పలుమార్లు పరిశీలించిన అంపైర్లు చివరకు మధ్యాహ్నం 2గంటలకు మరోసారి పరిశీలించి ఆటను రద్దు చేశారు. ఈ మ్యాచ్‌లో తొలి రోజు కేవలం 35 ఓవర్ల ఆట మాత్రమే జరిగింది. బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 107/3 స్కోరుతో కొనసాగుతోంది. ఈ మ్యాచ్ డ్రాగా ముగిస్తే, సిరీస్‌ను టీమిండియా కైవసం చేసుకుంటుంది.



# రూల్ నెంబర్ 7

## ఇంత కథ ఉందా?

ఐపీఎల్ చరిత్రలోనే చెన్నై సూపర్ కింగ్స్ జట్టును మోస్ట్ సక్సెస్ ఫుల్ టీంగా నడిపాడు ధోని. చెన్నై సూపర్ కింగ్స్ మ్యాచ్ ఏ నగరంలో జరిగినా అభిమానులు పోటెత్తుతారు. మహేంద్రుడి పట్ల అభిమానుల్లో ఉన్న ఆ ఆదరణను చూసి చెన్నై యాజమాన్యం అతన్ని వదులుకునే సాహసం చేయడం లేదు. ఈ నేపథ్యంలో ఆ జట్టు యాజమాన్యం గతంలో బీసీసీఐ, ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ముందు వింత ప్రతిపాదనను ఉంచింది. జులై 31 ముంబైలో జరిగిన ఐపీఎల్ ఫ్రాంచైజీల సమావేశంలో ధోనిని అన్ క్యాప్డ్ ప్లేయర్‌గా వర్గీకరించాలని సూచించింది. ఈ రూల్ ప్రకారం అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించి ఐదేళ్లు కావాలి. ధోని నాలుగేళ్ల క్రితం రిటైర్మెంట్ ప్రకటించాడు కనుక ఈ నిబంధనను సడలించాలని కోరింది. తాజాగా బీసీసీఐ ప్రకటించిన రూల్స్‌లో అన్ క్యాప్డ్ ప్లేయర్‌ను ప్రవేశపెట్టారు. ఐపీఎల్ ఫ్రాంచైజీలు 6 మంది ఆటగాళ్లను రిటైన్ చేసుకునే అవకాశం కలిపించింది. ఈ రూల్‌తో ఫ్రాంచైజీలు సంతృప్తికరంగా ఉన్నట్టు తెలుస్తోంది. వీరిలో గరిష్టంగా ఇద్దరు కనిష్టంగా ఒక అన్ క్యాప్డ్ ప్లేయర్ ఉండాలి. అన్‌క్యాప్డ్ ప్లేయర్‌కు రూ.4 కోట్లు చెల్లించాలి. ధోని కోసం ఈ రూల్ మరోసారి తిరిగి ప్రవేశపెట్టినట్టు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అంతేకాదు రూల్ నెంబర్ 7 అంటూ జత చేయడంతో ధోని కోసమే ఈ రూల్ తీసుకువచ్చారని స్పష్టంగా అర్థమవుతోంది. మాహీని చెన్నై సూపర్ కింగ్స్ అన్‌క్యాప్డ్ ప్లేయర్‌గా రిటెయిన్ చేసుకునే అవకాశముంది. ధోనీకి దాదాపు ఇదే చివరి సీజన్ కావడంతో అతను అన్‌క్యాప్డ్ ప్లేయర్‌గా జట్టులో కొనసాగే అవకాశం కనిపిస్తోంది.

